క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్‌డీఎస్‌ఎస్ పనులు చేస్తున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లె, యర్రపల్లె గ్రామాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు సహరించాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

వేడుకగా బొల్లావుల ఉత్సవం


బొల్లావులను ఊరేగిస్తున్న యువత

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టులో ఆదివారం గురప్పడుస్వామి ఉత్సవం సందర్భంగా బొల్లావుల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో మంత్రి వెంకటేశ్వర్లు, శ్రీను పర్యవేక్షణలో ఉత్సవం జరిపించారు. ముందుగా గ్రామంలో మేళతాళాలు, డప్పులు, యువకులు కేరింతలతో బొల్లావుల ఉత్సవం చేశారు. అనంతరం గురప్పడు స్వామి చెట్టుదగ్గరికి వెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ప్రకృతి అనుకూలించి, పాడిపంటలతో గ్రామం బాగుండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి


సర్టిఫికెట్లు అందజేస్తున్న షంషేర్ ఆలీబేగ్

మార్కాపురం: ఏపీ సీఆర్ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో మార్కాపురంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలను పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు, ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ సూచించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో 2వ రోజు శిక్షణా తరగతుల్లో ప్రెస్ అకాడమీ తరఫున హాజరైన పలువురు సీనియర్ జర్నలిస్టులు రిపోర్టింగులో పాటించాల్సిన జాగ్రత్తలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగాలు, సోషల్‌మీడియా ప్రభావాలు తదితర అంశాలపై మాట్లాడారు. ఏపీ యూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ రమణ తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్ తదితరులు మాట్లాడిన అనంతరం శిక్షణ పొందిన పాత్రికేయులకు సర్టిఫికెట్లు అందించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

మార్కాపురం టౌన్: బెంగళూరులోని కోరమాండల్ ఇండోర్ స్టేడియంలో ఆగస్టు 30, 31వ తేదీల్లో నిర్వహించిన కరాటే పోటీల్లో మార్కాపురం ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు 3 బంగారు, 2 సిల్వర్ మెడల్స్ సాధించినట్లు స్కూల్ చీఫ్ ఎగ్జామినర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్ట్రక్టర్ పి.ప్రసాద్ ఆదివారం తెలిపారు. 75 కేజీల కుమితే విభాగంలో స్కూల్‌కు చెందిన ఎస్‌కే షాకీర్‌బాషా గోల్డు మెడల్, అండర్ 9 బాలుర విభాగంలో కటాలో ఎస్‌కే ఆసిఫ్ గోల్డుమెడల్, కుమితేలో సిల్వర్ మెడల్, అండర్ 12 బాలుర విభాగం కటాలో ఎస్‌కే యాసీన్ గోల్డు మెడల్, 50 కేజీల కుమితే విభాగంలో జేకేఎస్‌సీ భార్గవ్ సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ఏపీ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కె.మిల్టన్‌శాస్త్రి బహుమతులు ప్రదానం చేసి అభినందించినట్లు చెప్పారు.

రూ.5కే టీషర్టు.. ఎగబడ్డ మహిళలు!


షాపు వద్ద గుమిగూడిన మహిళలు

మార్కాపురం టౌన్: మార్కాపురంలోని నెహ్రూ బజారులో ఓ దుస్తుల దుకాణం యజమాని 5 రూపాయలకే టీషర్టు అంటూ ప్రకటించడంతో ఆదివారం ఉదయం అధిక సంఖ్యలో జనం ఎగబడ్డారు. మహిళలు భారీగా రావడంతో కొంతసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఒక్కో దఫా కొందరిని దుకాణంలోకి పంపి టీషర్టులు విక్రయించాల్సి వచ్చింది. నెహ్రూ బజారు మొత్తం మహిళలు, వినియోగదారులతో నిండిపోయింది.

ఆధ్యాత్మిక సవ్వడి.. నిమజ్జన సందడి


పోతవరంలో ఊరేగింపుగా వెళ్తున్న గణనాథుడు


మార్కాపురం : పూజలు నిర్వహిస్తున్న అన్నారాంబాబు దంపతులు


గొట్లగట్టులో భక్తుల కోలాహలం


మార్కాపురం : లేస్ ప్యాకెట్ల మండపంలో కొలువుదీరిన గణనాథుడు

మార్కాపురం: గణేశ్ నవరాత్రుల సందర్భంగా ఊరూవాడా మండపాల్లో పూజలందుకున్న గణపతి విగ్రహాలను కోలాహలం మధ్య నిమజ్జనానికి తరలిస్తున్నారు. మార్కాపురం పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని మండపాల్లో గణనాథుడి విగ్రహాలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు దర్శించుకుని పూజలు చేశారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహం వద్ద తన భార్య దుర్గాకుమారితో కలిసి పూజలు చేశారు. 6వ వార్డులోని వడ్డే బజారులో పూజలు నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించారు. మండలంలోని జమ్మనపల్లి గ్రామంలో గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. దరిమడుగు, వేములకోట గ్రామాల్లో గణేష్ నిమజ్జనం గ్రామస్తుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.

లేస్ ప్యాకెట్లతో వినాయకుడు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని కోనేటి బజారులో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం వద్ద కుర్‌కురే, లేస్ ప్యాకెట్లతో మండపాన్ని అలంకరించారు. ఆదివారం విఘ్నేశ్వరునికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ మండపాన్ని తిలకించేందుకు పిల్లలు అధిక సంఖ్యలో వచ్చారు.

వెళ్లిరా.. వినాయకా..

పొదిలిరూరల్: మండలంలోని మాదాలవారిపాలెం, పోతవరం, కంభాలపాడు, రామాపురం, పాములపాడు గ్రామాల్లో గణనాథుల నిమజ్జన శోభాయాత్ర కనులపండువగా సాగింది. ఊరేగింపుగా వస్తున్న స్వామి వారికి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు ఇచ్చి భక్తిని చాటుకున్నారు. నిమజ్జన కార్యక్రమంలో ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ అభిమానులు వైఎస్ జగన్ పాటలతో హోరెత్తించారు.

కొనకనమిట్ల: మండలంలోని కొనకనమిట్ల, గొట్లగట్టు, నాయుడుపేట ఎస్సీ కాలనీ, గొట్లగట్టు హరిజన కాలనీతో పాటు పలు గ్రామాలలో పలు గ్రామాల్లో వినాయకుని విగ్రహాలను ఐదో రోజు ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ముందుగా వినాయకునికి విశేష ఉత్సవ పూజలు నిర్వహించారు. నాయుడుపేట హరిజన కాలనీలో అంబేడ్కర్ యూత్ ఫోర్స్ ఈశా కేశవ ఆధ్వర్యంలో చినరాయుడు, వెలుగొండరాయుడు, మాచర్ల, చెన్నకేశవులు, కరేటి నాగరాజుల పర్యవేక్షణలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించగా యువకులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కంభం చెరువు వద్ద కోలాహలం

కంభం: కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల్లోని వివిధ గ్రామాల్లో పూజలందుకున్న గణనాథుడి విగ్రహాలను ఆదివారం కోలాహలం మధ్య కంభం చెరువులో నిమజ్జనం చేశారు. చెరువుకట్ట వద్ద ఎటువంటి ఇబ్బంది లేకుండా సీఐ కె.మల్లికార్జున, ఎస్సై నరసింహారావు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కొమరోలు: మండలంలోని తాటిచెర్ల, నాగిరెడ్డిపల్లె, గోహరపల్లె, కొమరోలు, బాదినేనిపల్లె, గోపాలునిపల్లె గ్రామాల్లో 5 రోజులుగా పూజలందుకున్న గణనాథుడి విగ్రహాల నిమజ్జనం వైభవంగా సాగింది. మహిళలు, యువతతోపాటు ఆయా గ్రామాల ప్రజలు ఊరేగింపులో సందడి చేశారు.


కొమరోలు : తాటిచెర్లలో నిమజ్జనానికి తరలివెళ్తున్న భారీ గణనాథుడు

అర్ధవీడు: మండలంలోని అంకభూపాలెం, పాపినేనిపల్లి, అర్ధవీడు, బొల్లుపల్లి, కొత్తూరు, నాగులవరం ,గ్రామాల్లో ఆదివారం గణనాథుడి నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అర్ధవీడులో గణేశ్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద 10 కేజీల లడ్డూ ప్రసాదాన్ని బండి వెంకటరమనయ్య 65 వేల రూపాయలకు దక్కించుకున్నారు. పాపినేనిపల్లిలో 10 కేజీల వినాయకుని లడ్డూను నగురూరి కేశవరెడ్డి 70 వేల రూపాయలకు దక్కించుకున్నారు.


గొట్లగట్టులో..


కంభం చెరువులో నిమజ్జనం చేసేందుకు వినాయకుడిని తీసుకెళ్తున్న దృశ్యం


దరిమడుగులో గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న ప్రజలు


నాయుడుపేట హరిజన కాలనీలో గణేష్ ఉత్సవం


కంభం చెరువులో వినాయక నిమజ్జనం చేస్తున్న దృశ్యం

వైఎస్సార్ సీపీ అభివృద్ధిపై దృష్టి సారించండి


అన్నా రాంబాబును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

● మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: వైఎస్సార్ సీపీలో నూతనంగా పదవులు పొందిన వారు పార్టీ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. మార్కాపురం పట్టణంలోని వివిధ వార్డులకు కమిటీ అధ్యక్షులుగా పలువురిని నియమించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సలీమ్‌తో కలిసి నూతనంగా ఎన్నికైన వార్డు అధ్యక్షులు ఆదివారం అన్నా రాంబాబు నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కాపురం పట్టణంలో పార్టీ పటిష్టతపై అందరూ దృష్టిసారించాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, సతీష్, శ్రీను, రఫీ, జాకీర్, ఇస్మాయిల్, కరీముల్లా, భాను, బాలాజీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

పొదిలి: భారతీయ తపాలా ఉద్యోగుల సంఘం (గ్రూప్ సి) మార్కాపురం డివిజన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.రవీంద్ర, సయ్యద్ ఇమామ్, ఉపాధ్యక్షులుగా విశ్వరూపరాణి, ఎం.రాజశేఖర్, డిప్యూటీ సెక్రటరీగా ఎ.శివశంకర్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీలుగా కె.సాయిరాం, డీజే పాల్, ఎస్‌కే రసూల్, కె.ప్రసాద్, ఎల్.వెంకటరావు, కోశాధికారిగా శేఖర్‌ను ఎన్నుకున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎన్నికైన ఎస్‌కె బాజీబీ, ఆర్ సునీత, రాజేష్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజనల్ సూపరింటెండెంట్ జీవీ శ్రీనివాసులు, సంఘ రాష్ట్ర కార్యదర్శి వెంకయ్య హాజరయ్యారు.

ప్రమాదకరంగా చప్టాలు


కాలేజికి వెళ్లే దారిలో కుంగిపోయిన చప్టా వద్ద పెట్టిన డ్రమ్ము

కంభం: మేజర్ పంచాయతీలైన కంభం, కందులాపురంలో పలు చోట్ల కాల్వల చప్టాలు, వాల్వు గుంతలు, ఇరిగేషన్ కాల్వల అంచులు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై స్థానిక ప్రజలు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలేజ్ రోడ్డులో డ్రైనేజి కాలువ చప్టా పది రోజుల క్రితం ఓ వైపు కుంగిపోగా డ్రమ్ము అడ్డుగా పెట్టి వదిలేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కంభం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న రెండు డ్రైనేజీ చప్టాలు పూర్తిగా కుంగి పోగా వాటిపై రెండు బస్సు టైర్లు పెట్టి వదిలేశారు. దీంతో బస్సులు మలుపు తిప్పుకొనేందుకు ఇబ్బందికరంగా మారింది. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా ఆర్టీసీ అధికారులు కానీ పంచాయతీ అధికారులు కానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.


కంభం బస్టాండులో కుంగిన చప్టాల వద్ద పెట్టిన టైర్లు

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ తల్లికి ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు భక్తులు పూజలు చేశారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వర్షానికి పంటపొలాలు జలమయం

కంభం: శనివారం రాత్రి మండలంలో పలు చోట్ల కురిసిన వర్షానికి వీధులన్నీ జలమయమయ్యాయి. తురిమెళ్ల, యర్రబాలెం సమీపంలోని పంటపొలాల్లో వర్షం నీరు భారీగా నిలిచిపోయింది. పొలాల్లో నువ్వుల ఉడ్లలు తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి చేలల్లో వర్షం నీరు నిలిచిపోయింది. గత రెండు రోజులుగా నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షానికి గుండ్లకమ్మ వాగు ఉధృతి పెరిగి కంభం చెరువుకు నీరు చేరుతోంది. ప్రస్తుతం కంభం చెరువులో 7 అడుగుల మేర నీరు ఉంది.


యర్రబాలెం వద్ద కంభం వైపు ప్రవహిస్తున్న గుండ్లకమ్మ వాగు


తురిమెళ్లకు వెళ్లే మార్గంలో జలమయమైన పంటపొలాలు


తురిమెళ్ల సమీపంలో పంట చేలో నిలిచిన వర్షం నీరు


వర్షానికి తడిసిపోయిన నువ్వుల ఉడ్లలు